# దేవదేవుని దురవస్థ

గభాలున జారిపడనే పడ్డాను, వుప్పొంగుతున్న ఆశ్చర్యాంబుధిలో. కాని, మరుక్షణమే, ఆశ్చర్యం దుఃఖముగా మారిందని గ్రహించా. ఎందుకంటే, ఆ దేవదేవుడంతటివాడు, వార్నింగన్నా యివ్వకుండా, వచ్చికూచుంటే, చదవడానికొక దండకమైనా, కనీసమొక కందపద్యమైనా రాదే అని' అయినా ధైర్యం చేసి,

“శ్రీ కంఠచాపఖండన
పాకారిప్రముఖ...పాకారిప్రముఖా...
ఆ.. ఆ...ఆ”

అంటూంటే, శ్రీవారు మందస్మితులై,

“చాల్లే, నువ్వు మాత్రమేం చేస్తావ్, అది రానంటూంటే? సరేగాని యిటు కూర్చో” అన్నారు.

“రాకపోతే పూరుకుంటానా ఆరున్నొక్క రాగంలో సాగదీస్తాగాని” అందామనుకున్నాగాని, పుటుక్కున “పరిహాసాలా” అని వొకశాపం పారేస్తే, ఏడ్చి పోవలసివస్తుందని నోరు నొక్కుకున్నా.

శ్రీవారు గభాల్న మాట్లాడడం మొదలుపెట్టారు.

“మా శేవూ”

చుట్టూ చూశాను, “ఏమిటి?”

“అది కాదోయ్”

“మరి ఏదండీ”

“ఏయ్! నువ్వెక్కడో ఏదో లాగున్నావే? సరేకాని, మీవాళ్లు నన్నెంత యిబ్బంది పెడుతున్నారో చూశావా, నా కరుణను అలుసుగా భావించి?” అన్నారు భగవానులు సీరియస్‌గా.

“అవును,” అన్నాను మరేమీ తోచక.

“అవునేమిటి నీ మొహం,” అన్నారు విసుగుగా కాసేపు నిశ్శబ్దం. మళ్లా మ్రోగింది శ్రీవారి కంఠం. అది మేఘగర్జనములాగా లేకపోయినా, బొత్తిగా డప్పు మ్రోతలాగా మాత్రం లేదని చెప్పగలను.

“ఇదివరకు అర్చకులు పులిహోర, దద్ధ్యోజనమూ ఆరగింపు పెట్టేవాళ్లు. ఈమధ్య కాఫీ, యిడ్లీలలవాటు చేశారు. ఇప్పుడు ఆఫీసర్లు తనిఖీకి వస్తే, కాఫీ అలవాటు మాన్పించి, దద్ధ్యోజనాలు పెడితే - నీవే చెప్పు - ఎట్లా బ్రతకడం?”

“బ్రతక్క ఏంజేస్తావ్”

అని నాలుక చివరిదాకా వచ్చింది. పాపం, బ్రతకడం యిష్టంలేకపోయినా, చావడానికి వీలులేని గతి పట్టిందే యీ ఆదిమధ్యాంత రహితునికి అని నాకు చాలా యిదయింది. నిజంగా వొకగంట కాఫీకి ఆలస్యమయిందంటే నేను ఆగలేను. నాకు ఏం చేయడానికీ తోచక ఆయన చెప్పేది నోరుమూసుకుని వింటున్నాను.

“ఈమధ్య వొక అపరచార్వాకుడుదయించి, పత్రికలు గూడా వెలగబెడుతున్నాడని వింటున్నాను” యింకా చెప్పుకుపోతున్నారు. కాని, నేను వింటంలేదు నా మనస్సు, ఆ పత్రిక పేజీలు మూడా నాలుగా అన్న తర్కంలో మునిగివుంది. ఇంతలో హఠాత్తుగా వులిక్కిపడ్డాను శ్రీవారి ప్రశ్నతో.

“ఇదిగో, నీవు లేవని రాయటానికి నేనొక పత్రిక పెడితే నీ కెట్లా వుంటుందీ?”

నాకు నిజమేననిపించింది. ఆ విషయం తల్చుకుంటే వొళ్లు గగుర్పొడిచింది. కాదు మరీ, నేను చచ్చాననైనా కాదు. అసలే లేనని రాయడానికి వొక పత్రికా? ఏం విడ్డూరం? ఇది కలియుగమేనని నాకు నమ్మకం తోచింది. కాని, సానుభూతి ప్రకటనకైనా వ్యవధి యీయకుండా శ్రీవారు మొదలుపెట్టారు, గర్జిస్తూ.

“వాళ్ళను నామరూపాలు లేకుండా చేయగలను, కాని, వాళ్ళు నా బిడ్డలు. నేనే కోపగిస్తే వారికిక దిక్కేది? అన్నట్టు, నీవు మా అబ్బాయి క్రీస్తు చెప్పినది వినలేదా?”

నాపని సంకటంలో పడ్డది. విన్నట్టు జ్ఞాపకంలేదు. వినలేదంటే ఎటొచ్చి ఎటు బోతుందో అని చివరకు కష్టంమీద “ఊఁ” అన్నా.

“కలియుగంలో, యిదివరకంత కష్టం లేకుండా ముక్తిమార్గము సాఫుగా చేశాను. కాని, వొకసారి తలచుకొనే దిక్కయినా లేకుండాపోయింది. పాపం పెరిగిపోతున్నది. అయితే, నువ్వెప్పుడైనా భగవద్గీత చదివావా?”

ఇహ తప్పేట్టులేదు. అందుకని మొహం పగిలినా లక్ష్యపెట్టకుండా బోర్లపడ్డాను.

“దేవా! ఈసారి క్షమించండి. ఈ వేళే షాపు కేగగలడు యీ పరమాణువు” అని మనవిజేసుకున్నాను.

శ్రీవారు చకితులై,

“ఇదేమిటోయ్! గీత చదివావా అంటే షాపంటావేం?” అని అడిగారు.

“అక్కడే గీత అమ్ముతారండీ. కొని వెంటనే చదువుకుంటాను.”

భగవానులు ప్రసన్నముఖులై, “సరేలే! మీరందరూ నేను కనబడనని మిడుకుతుంటారుగదా, బయటికొస్తే ఏమన్నా ఉందా? ఎన్నికల్లో డిపాజిట్లు దక్కించడమునుండి, బేబీ అజీర్ణమాత్రల సేలు యెక్కువ జేయడమువరకు నా పనే అవుతుందాయె. రాళ్ళల్లో, చెట్లల్లో, పుట్టల్లో దాగివుంటేనే చంపుతున్నారే—‘స్వామీ! నా భార్య బరువు 600 పౌనులనుండి 100 పౌనులకు తగ్గిస్తే—పౌనుకు పది కొబ్బరి కాయలు కొడతామని? ఇక, కండ్లెదట వుంటే—నువ్వే ఆలోచించు!’

నా కిందులో వొక్కటీ అబద్ధమనిపించలేదు. ఇంతలో వొక సంగతి తోచింది. ఇందాకటినుండి, యిదవుతున్నారే, ధూపదీప నైవేద్యము లర్పించకపోయినా, అరకప్పు కాఫీయైనా పొయ్యకుంటే బాగుంటుందా అని వెంటనే చప్పున లేచి నిలుచున్నాను.

దేవదేవులు స్తబ్ధులై, “నన్ను లేచి పొమ్మనా నీ వుద్దేశ్యం?” అన్నారు.

నేను వెంటనే లెంపలేసుకొని, “తప్పు తప్పు, మిమ్మల్ని అనగలడా యీ దాసుడు? పోయి కాఫీ తెద్దామని లేచాను” అన్నా బిత్తరబోయి.

శ్రీవారు పరమానందపడి, “భేష్! మనసులో మాట కనిపెట్టావోయ్. పో,” అన్నారు.

తరువాత నేను తెచ్చిన కాఫీని మెచ్చుకుంటూ, “బలే ‘*strong*’గా ఉందోయ్! ఎవరు చేశారు?” అని అడిగారు.

(౩౯-వ పేజీ చూడండి)

★ శ్రీ భండారు పర్వతాలరావు ★

# దేవదేవుని దురవస్థ

(21-వ పేజీ తరువాయి)

అంతట విసయిపోయి, "నేనేనండి కలిపింది" అన్నాను ఎరక్క.

శ్రీవారు రుద్రులై పోయి, "ఓరీ! నీచా! కాలేజీగుడ్డల కంపుతో కాఫీ జేసి పోస్తివి గదరా! సన్యాసీ! చూడు, నీ పాపిష్టి చేతి నేమి చేసెదనో" అంటూ వొక గడ్డిపోచను తీసికొని నా కుడిచేతిమీద వేశారు. "*My God*! ఏం *Tragedy*!"

కొంచెము తెప్పరిల్లుకొని చూచేసరికి, నేను మంచంక్రింద ఉన్నాను. శ్రీవారు కనపడలేదు. చేయి చూసుకు నేసరికి బొబ్బ యెక్కి వుంది!

నేను మరొకసారి ఉవ్వెత్తుగా ఉప్పొంగిన ఆశ్చర్యాంబుధిలో స్నానము జేస్తూండగానే, గదిలోంచి మా బావ అంటూన్న మాటలు వినిపించాయ్.

"ఇదిగో! మీ తమ్ముడు ఏదో పైత్రిజులు కొట్టేడని సంతోషిస్తుంటివే, చూడు. చేతిమీద సిగరెట్ అంటించినా తెలివిరాని మొద్దుని." ★

# అయాచిత సత్కారం

(11-వ పేజీ తరువాయి)

వాడనేసరికి ఎందుకన్నానా ఆమాట అని పశ్చాత్తాపబడ్డాను. సరే ప్రయత్నిస్తాలే అన్నాను. వాడూ కొండంతభారం వదలి నట్లుగా తృప్తిగా వెళ్ళిపోయాడు.

రోజులు గడచినవి. నేనూ యీ విషయాన్ని సంపూర్ణంగా మరచి పొయ్యాన్ను. రోజూ డిప్టీమాజస్ట్రేటు యింటికి పోతూనే ఉన్నాను. రావూ మాయింటికి వస్తూనే ఉన్నాడు. యిద్దరం కొరుషి కొర్లూ క్లబ్బురోమాన్సూ నడుపుతూనే ఉన్నాం. కానీ ఎన్నడూ నే నావిషయం ప్రస్తావించనే లేదు. అతడూ యిలాంటి విషయాలు నాతో ఎన్నడూ మాట్లాడలేదు.

ఒకరోజున అదే కుర్చీలో కూర్చొని పదేండ్లనాటి పాతపేపరు చదువుతున్నాను. పెళ్లాం పుట్టింటికి వెళ్ళింది. మనస్సు చికాకుగా ఉంది. యింతలో నే పోస్టుబ్ర్యాను వచ్చి తలుపుతట్టాడు. నాకేమైనా పేపరు వచ్చిందా అన్నాను. మీకు ఐదొందలు మనియార్డరూ ఒక రిజిష్టర్ కవరూ వచ్చిందండీ అన్నాడు. నాన్నాలు జీవితంలో ఎన్నడూ యాభైకి మించి మనియార్డర్ రాలేదు. ఏ హిందీపత్రికా సంపాదకుడూ నాకు పదికి మించి పంపలేదు అని విడ్డూరపడుతూ డబ్బు తీసికొని పోస్టువాడి మామూలు వాడికిచ్చి కవరు చించి చదివాను.

డియర్ బ్రదర్, కృష్ణుడిని వదిలి పెట్టారు. అనుకున్నంతా నెరవేర్చావన్న మాట. ప్రాసిక్యూషన్ సాక్ష్యం బలంగా ఉంది. ఐనా కేసుకొట్టివేయబడింది. కారణ మెవ్వరికీ తెలియదు నాకు మినహా. ఈ నా కృతజ్ఞతాపూర్ణమైన బహుమానాన్నంగీకరించగలవని ప్రార్థన. —శేఖరం ★

# బైజు బావరా

(31-వ పేజీ తరువాయి)

నిసరిగా తన ఓటమిని స్వయంగా ఒప్పుకొన్నాడు.

ఇక యెవరు మాత్రం ఏం చేయగలరు? అక్బరుబాదుషా కంట తడి పెట్టుకొని బైజూను పిలిచి, తాన్‌సేన్‌కు యెటువంటి శిక్ష విధిస్తావో విధించుకోమని అతని ప్రాణాల్ను బైజూకు వప్పగించేశాడు. తాన్‌సేన్‌తో పాటుగా, చక్రవర్తి, ప్రజలూ కూడా బైజూ ఉరిశిక్షే విధించగలడని నమ్మారు. కాని బైజూ సవినయంగా, "ప్రభూ నాసరస్వతి పరులకు హానిచేసే నిర్భాగ్యురాలు గాని నిర్దయురాలు గానీ కాదు. నాగురువుకు యిచ్చిన వాగ్దానాన్ని బట్టి, ఎందరి ప్రాణాలనో బలిగొన్న యీ విద్వాంసునికి సయితం, నేను కీడు చేయలేను. కాని చిన్నమనవి నా దొకటి. మీరు మన్నించాలి. నేటినుండి ఆగ్రానగరంలో వున్న యీ కరినశాసనాన్ని రద్దుచేయాలి. అదే నాకు పదివేలు"

అంతటితో చక్రవర్తి కళ్లకు క్రమ్మిన మాయపొర తొలగిపోయింది కృతజ్ఞతతో పరిపరివిధాల బైజూను పొగిడి, యెంతో గౌరవంచి, సత్కరించాడు. ప్రజలుసైతం బైజూను దేవతామూర్తిగా గౌరవించారు. తాన్‌సేన్ తన పశ్చాత్తాపాన్ని వెలిబుచ్చి వెక్కి-వెక్కి యేడ్చాడు. దానితో అతని హృదయభారం తగ్గిపోయింది.

బైజూ ఆ తర్వాతకూడా తన గానకళా నైపుణ్యాన్ని పరోపకారానికే ఉపయోగించి తన కీర్తిని శాశ్వతంగా నిలబెట్టుకున్నాడు. ★



"ఎదురు చూపు"